ప్రజాశక్తి
సోమవారం 6 ఫిబ్రవరి 2023


శ్రీకాకుళం


మాట్లాడుతున్న హనుమంతు సాయిరాం

వలస కూలీలకు
పింఛను కష్టాలు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు, లావేరు

ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు, అలాగే మరోచోట నుంచి జిల్లాకు వచ్చే పింఛను లబ్ధిదారులకు ప్రతి నెలా కష్టాలు తప్పడం లేదు. బతుకుదెరువు కోసం వందలాది కిలోమీటర్లు వెళ్లే కూలీలు ప్రతి నెలా ఐదో తేదీలోపు పింఛను కోసం వ్యయ, ప్రయాసలు పడి స్వస్థలాలకు రావాల్సి వస్తోంది. ఇక్కడ పనులు చేసుకుంటున్న ఇతర ప్రాంతాల వారిదీ అదే పరిస్థితి.



ఆ అవకాశం లేకనే..

జిల్లాలో 3,17,901 మంది లబ్ధిదారులు వృద్ధాప్య, వితంతు, వికలాంగులు, ఒంటరి, తదితర విభాగాల కింద పింఛను నగదు తీసుకుంటున్నారు. ప్రభుత్వం జనవరి 1 నుంచి రూ.250 పెంచింది. వీరితో పాటు జిల్లాలోని 30 మండలాలు, నాలుగు మున్సిపాలిటీల్లో 9,346 కొత్త పింఛన్లను మంజూరు చేసింది. వారిలో సుమారు లక్ష మంది వ్యవసాయ లేదా ఇతరత్ర కూలీ పనుల నిమిత్తం తాత్కాలికంగా అయిదారు నెలలు జిల్లాలోని సుదూర ప్రాంతాలు లేదా ఇతర జిల్లాలకు వలస వెళ్తున్నారు. మరికొందరు అక్కడే మూడు, నాలుగేళ్ల పాటు జీవిస్తున్నారు. ఆ మధ్య వరకు రాష్ట్రంలో ఎక్కడైనా పింఛను తీసుకునేలా పోర్టబులిటీ విధానం అమల్లో ఉండేది. కోవిడ్ తర్వాత ఆ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఆ స్థానంలో రాష్ట్రంలోని ఏదైనా సచివాలయానికి మార్చుకునేలా వెసులుబాటు కల్పించింది. ఆ తర్వాత సొంతూరుకు మళ్లీ మార్చుకోవచ్చు. ఈ విధానంపై లబ్ధిదారులకు అవగాహన లేదు. గతంలో మూడు నెలల పింఛను కలిపి ఒకే సారి తీసుకునే అవకాశం ఉండేది. ప్రస్తుతం అదీ లేదు. ఏ నెల తీసుకోకున్నా నగదును తిరిగి ప్రభుత్వానికి జమ చేయాలి. దీంతో లబ్ధిదారులు ఆర్థికంగా నష్టపోతున్నారు. వరుసగా మూడు నెలలు నగదు తీసుకోకపోయినా స్థానికంగా లేనట్లు నిర్ధారించి పింఛను రద్దు చేస్తారు. తగు కారణాలతో మళ్లీ ఎంపిడిఒకు దరఖాస్తు చేసుకుంటే మంజూరుకు రెండు, మూడు నెలల సమయం పట్టనుంది. ఇదంతా వ్యయ, ప్రయాసలతో కూడిన పని కావడంతో ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో స్థిరపడినవారు సైతం ప్రతి నెలా అయిదో తేదీలోపు వారాంతం చూసుకుని సొంతూరుకు వస్తున్నారు.

ఈ ప్రాంతాల్లో వలసలు అధికం

లావేరు, రణస్థలం, పోలాకి, నరసన్నపేట, కవిటి, వజ్రపుకొత్తూరు, సారవకోట, తదితర మండలాలకు చెందిన ఎక్కువ మంది కూలీలు విజయవాడ, ప్రకాశం, నెల్లూరు, గోదావరి జిల్లాలు, హైదరాబాద్, బెంగుళూరు, తమిళనాడుకు ఉపాధి నిమిత్తం వలసలు వెళ్తుంటారు. అక్కడి నుంచి స్వగ్రామానికి వచ్చి వెళ్లేందుకు సుమారు రూ.800 నుంచి రూ.1500 వరకు ఖర్చు పెడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏ ప్రాంతంలోనైనా పింఛను తీసుకునే వెసులుబాటు ఉండేది. కొన్నాళ్లుగా ఈ అవకాశం లేకపోయింది. ప్రస్తుతం బియ్యం కార్డుదారులకు పోర్టబులిటీ విధానం అమల్లో ఉంది. అదే తరహాలో రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనైనా పింఛను తీసుకునే వెసులుబాటు కల్పించాలని వలస కూలీలు కోరుతున్నారు.

రానుపోనూ ఛార్జీలకే సగం ఖర్చు

ప్రతి నెలా పింఛనుకు రావడం చాలా కష్టం



ప్రతి నెలా పింఛను తీసుకోవడానికి హైదరాబాద్ నుంచి రావడం చాలా కష్టంగా ఉంది. రానుపోను రూ.2వేలు ఖర్చువుతోంది. వచ్చే పింఛను రవాణా ఖర్చులకే సరిపోతుంది. గతంలో రెండు, మూడు నెలలకు ఒకసారి వచ్చి పింఛను తీసుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు నెల నెలా రావడం కష్టం. గతంలో ఉన్నట్లు సదుపాయం కల్పిస్తే బాగుంటుంది.

-కె.బాలకష్ణ, గోవిందపురం, వజ్రపుకొత్తూరు

ప్రతి నెలా తిరుగుతున్నా



విజయవాడలో వలస కూలీగా పని చేశాను. నాలుగు నెలల క్రితం కాలు విరిగింది. భార్యలేదు. పిల్లలు విజయవాడలో ఉపాధి నిమిత్తం వలస వెళ్లారు. కాలు నయం కాకపోవడంతో వారి వద్ద ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్నాను. ప్రతి నెలా పింఛను కోసం తిరగాల్సి వస్తోంది. పింఛను కంటే బస్సు ఛార్జీలు అధికమవుతున్నాయి. రాకపోతే పింఛను పోతుందేమోనన్న భయం. పోర్టబులిటీ సమయంలో మూడు నెలలకోసారి తీసుకునే అవకాశ ఉంది. ఇప్పుడు అలా కాకపోవడంతో కాలి నొప్పితో తిరగడం కష్టంగా ఉంది.

-పల్లింటి నిలారావు, కేశవరాయపురం, లావేరు

సిపిఎస్‌ను రద్దు చేయాల్సిందే

- జిపిఎస్‌ను ఒప్పకోం
- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిందేనని, ప్రత్యామ్నాయంగా ప్రవేశపెడతామంటున్న జిపిఎస్‌ను ఒప్పుకునే ప్రశ్నేలేదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర స్పష్టం చేశారు. ఈ నెల 3న ధర్మస్థలిలో చేపట్టిన సంకల్ప దీక్షను పోలీసులు భగ్నం చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసన దీక్షల్లో భాగంగా ఆదివారం ఉదయం స్థానిక ఎన్‌జిఒ హోం వద్ద జిల్లా శాఖ ఆధ్వర్యంలో సంకల్ప దీక్షను చేపట్టారు. ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, చౌదరి రవీంద్ర దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. సాయిరాం మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి వస్తే వారంలోపే సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తానని హామీ ఇచ్చారని, ఆ హామీ మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయుల అండదండలతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి, గద్దెనెక్కాక వీరిని విస్మరించారని విమర్శించారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్నా సిపిఎస్ కొనసాగుతోందని, మాట తప్పను, మడమ తిప్పను అని పదేపదే ప్రకటించుకునే ముఖ్యమంత్రి సిపిఎస్ రద్దు విషయంలో మాట తప్పి, మడమ తిప్పారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర మాట్లాడుతూ సిపిఎస్‌పై ముఖ్యమంత్రికి అవగాహన లేకపోవడం వల్లే సిపిఎస్ రద్దుపై హామీ ఇచ్చాడని సలహాదారులు, ప్రభుత్వ పెద్దలు ప్రకటనలు ఇవ్వడం దారుణమన్నారు. సిపిఎస్ బదులు గ్యారెంటెడ్ పెన్షన్ స్కీమ్ (జిపిఎస్) విధానాన్ని అమలు చేస్తామన్నడం విడ్డూరంగా ఉందన్నారు. జిపిఎస్ పేరుతో ఉద్యోగ, ఉపాధ్యాయులను మరోసారి వంచించేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పి.అప్పారావు, ఎస్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ సిపిఎస్‌కు ప్రత్యామ్నాయంగా జిపిఎస్‌ను అంగీకరించే ప్రశ్నేలేదని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఛత్తీస్‌ఘడ్, రాజస్థాన్, తమిళనాడు, మధ్యప్రదేశ్, పంజాబ్ లాంటి రాష్ట్రాలు సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరిస్తుంటే హామీ ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ఇచ్చిన హామీ అమలు చేయమని శాంతియుతంగా నిరసనలు చేస్తుంటే, ఉద్యమాలను అణచివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం సబబు కాదన్నారు. ప్రభుత్వ నిర్బంధాలకు భయపడే ప్రశ్నే లేదని, ఇచ్చిన మాట ప్రకారం పాత పెన్షన్ స్కీంను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షకు ఎస్‌ఎన్‌టిఎ నాయకులు కె.రంగనాయకులు, ఆప్టా నాయకులు బి.గోవిందరాజులు, డిటిఎఫ్ నాయకులు కె.అప్పారావు, పోస్టల్ యూనియన్ నాయకులు కె.చంద్రశేఖరరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బి.ధనలక్ష్మి, జిల్లా కార్యదర్శి జి.సురేష్, రాష్ట్ర కౌన్సిలర్లు జి.గిరిధర్, కె.వైకుంఠరావు, సిపిఎస్ కమిటీ కన్వీనర్ జి.నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి సింహాచలం

(6లో)

చదువుతోనే జీవితాల్లో వెలుగు

స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

చదువుతోనే విద్యార్థుల జీవితాలు మారతాయనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోందని శాసనసభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. మున్సిపాలిటీలోని జగ్గుశాస్త్రులపేట, బైరిశాస్తులపేటలో ఆదివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్నారు. స్పీకర్ తమ్మినేని మాట్లాడుతూ అమ్మఒడి కార్యక్రమం ద్వారా ప్రతి తల్లి ఖాతాలో నేరుగా రూ.15వేలు జమచేయడం జరుగుతుందన్నారు. విద్యాకానుక ద్వారా మూడు జతల ఏకరూప దుస్తులు, ఒక నాణ్యమైన స్కూలు బ్యాగు, షూ, రెండు జతల సాక్సులు, ఒక బెల్టు, పాఠ్య పుస్తకాలు(ఇంగ్లీష్/తెలుగు), వర్కుబుక్స్, నోట్ బుక్స్, డిక్షనరీ మొదలగు తొమ్మిది రకాల వస్తువులను విద్యార్థులకు అందజేయడం జరుగుతుందన్నారు. విద్యకు ఏదీ అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో ఈ కానుకను ప్రభుత్వం అందిస్తున్నట్లు చెప్పారు.. గతంలో ఎన్నడూ లేనివిధంగా నాడు నేడు ద్వారా పాఠశాలలో మరుగుదొడ్లు, తాగునీరు, మరమ్మతులు, విద్యుత్, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, మోడర్న్ ఫర్నిచర్, గ్రీన్ చాక్‌బోర్డు, ఇంగ్లీష్ ల్యాబ్స్, ప్రహరీలు, గోడలకు పెయింటింగ్, అదనపు తరగతి గదుల నిర్మాణం వంటివి చేపట్టడం జరిగిందన్నారు. విద్యార్థులకు సరైన పోషకాహారం లభించకపోతే రక్తహీనత వచ్చే అవకాశం ఉందని గుర్తించిన ప్రభుత్వం జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని అమలుచేస్తూ, రోజుకో మెనూతో నాణ్యమైన పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందిస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, దుంపల శ్యామలరావు, పొన్నాడ చిన్నారావు, పోదిలాపు తిరుపతి, కుప్పిలి సత్యనారాయణ, దుంపల చిరంజీవి, బొడ్డేపల్లి రాజు,స్థానిక నాయకులు సంపతిరావు రామారావు, మెట్ట చక్రధర్‌రావు, కిల్లి అప్పలనాయుడు, కిల్లి చంద్రరావు, శిమ్మ సత్యనారాయణ, శిమ్మా జగదీష్, సంపతిరావు అరుణ్ కుమార్, హనుమంతు రాము, కూర్మాన రాము, తదితరులు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

విదేశీ విద్య.. నిబంధనలతో మిథ్య!

- జిల్లాలో ఒక్కరికే అందిన సాయం
- అర్హుల సంఖ్య ఐదుకే పరిమితం
- విదేశాల్లో చదువుతున్నా తప్పని ఎదురుచూపులు
- పేద విద్యార్థులకు దక్కని అవకాశం

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం పున్ణ ప్రారంభించిన జగనన్న విదేశీ విద్య పథకం కొందరికే పరిమితమవుతోంది. పథకంలో భాగంగా విదేశాల్లో చదివే వారికి భారీ సాయం అందిస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా నిబంధన పేరుతో అర్హుల జాబితాలో కోత విధించారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విదేశీ విద్య చదువుతున్న వారిలో జిల్లాలో ఐదుగురే ఈ పథకం ద్వారా లబ్ధి పొందడానికి ఎంపిక చేసిన అధికారులు వారిలో ఒక్కరికే రూ.35లక్షలు అందించగలిగారు. మిగిలిన విద్యార్థులంతా ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రపంచ ర్యాంకింగ్ కలిగిన 200 విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందిన వారికి ఈ పథకం వర్తిస్తుందని ప్రభుత్వం గతంలో వెల్లడించింది. కానీ నిబంధనతో అందులో కొన్ని విశ్వవిద్యాలయాలను పక్కన పెట్టారు. అందులో రాష్ట్రం నుంచి ఎక్కువగా రష్యా, ఉక్రెయిన్, కెనడా వంటి ప్రాంతాల్లో చదువుకునేందుకు వెళ్లిన వారే. వీరిని అనర్హులుగా చూపడం వల్ల ఎక్కువమంది నష్ట పోతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా నుంచి 98 మంది విదేశీ విద్యకు వివిధ విశ్వవిద్యాలయాలకు వెళితే వారిలో ఐదుగురిని అర్హులుగా ప్రకటించారు. వారిలో కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ వాటర్ లూలో ఎంఎస్ (ఈసిఈ) విద్యను చదువుతున్న చదువుల సింధూజకు విదేశీ విద్యా దీవెన పథకాన్ని వర్తింపజేశారు. ఆమె తండ్రి రమేష్‌బాబుకు చెక్కును అందజేశారు.

గత ప్రభుత్వహయాంలో పథకం ద్వారా విదేశాలకు వెళ్లిన విద్యార్థులకు రూ.కోట్లలో బకాయిలు చెల్లించాల్సి ఉంది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2018-19, 2019-20 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి మూడు విడతలుగా నిధుల్ని పెండింగ్‌లో పెట్టింది. మూడున్నరేళ్ల అనంతరం విదేశీ విద్య పథకాన్ని తిరిగి ప్రారంభించినప్పటికీ బకాయిలను చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 2018-19లో 84మంది విద్యార్థులకు పథకం వర్తింపజేశారు. ఇందులో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులు ఉన్నారు. వీరికి తోడు ఈబిసి విద్యార్థులకు ఈ పథకాన్ని వర్తింపజేశారు. ప్రభుత్వం నుంచి సాయం అందుతుందన్న ధైర్యంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థిక భారమే అయినా పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని విదేశాల్లో చదువుకునేందుకు పంపించారు. పథకం మంజూరైన తొలి నాళ్లలో లబ్ధిదారులకు కొంత మొత్తాన్ని ప్రభుత్వం సాయంగా అందించడం జరిగింది. తర్వాత ఈ పథకాన్ని నిలిపి వేశారు. విదేశాల్లో చదువుతున్న పిల్లల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి తల్లిదండ్రుల వంతైంది.

నిబంధనలు సడలిస్తేనే మేలు..

జగనన్న విదేశీ విద్య పథకంలో ప్రపంచ వ్యాప్తంగా ఒకటి నుంచి 200లోపు క్యూఎస్ ర్యాంకు కలిగిన విశ్వ విద్యాలయాల్లో సీటు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుంది. ఒకటి నుంచి వంద లోపు ర్యాంకు ఉన్న విశ్వ విద్యాలయంలో ప్రవేశం పొందిన వారికి గరిష్ఠంగా రూ.కోటి వరకు వంద శాతం ఫీజు రీయింబర్స్ చేస్తారు. 101 నుంచి 200 వరకు ర్యాంకు కలిగిన వర్సిటీల్లో సీటు తెచ్చుకుంటే రూ.50 లక్షల అందిస్తారు. ఈ నిబంధన కారణంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు అర్హత కోల్పోతున్నారని వారి తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఒకటి నుంచి 500 ర్యాంకింగ్ ఉన్న విశ్వ విద్యాలయాల్లో ప్రవేశం పొందిన వారికి పథకాన్ని వర్తింపజేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బిసిల్లోని పేద విద్యా ర్థులకు విదేశీ విద్య అందించాలనేది పథకం లక్ష్యం. ఈ నేపథ్యంలో నిబంధనను సడలిస్తే ఎక్కువ మంది కి ప్రయోజనం కలుగుతుందని విద్యార్థులు అంటున్నారు.

అప్పు తెచ్చి ఫీజు చెల్లించా..

మా అమ్మాయి చదువుల సింధూజ విదేశీ విద్య పథకం కింద కెనడా లోని యూనివర్సిటీ ఆఫ్ వాటర్ లూలో ఎంఎస్(ఈసిఈ) విద్యను చదువుతోంది. ప్రభుత్వం ఇప్పటి దాకా ఒక్క రూపాయి ఇవ్వలేదు. ఫీజు చెల్లిస్తేనే భోజనం, పరీక్షకు అనుమతి ఇస్తున్నారు. పరీక్షలకు అనుమతి ఇవ్వకుండా అక్కడి యాజమాన్యాలు ఇబ్బంది పెడతాయన్న భావనతో అప్పు చేసి చెల్లించడం జరిగింది. కానీ ప్రభుత్వం ఈ పథకాన్ని వర్తింప జేయడం వల్ల రూ.35లక్షలు రావడం కొంత ఊరట.

-చదువుల రమేష్‌బాబు , సింధూజ తండ్రి

'పది'లంగా ఫలితాలకు ప్రణాళిక

- విద్యార్థులంతా ఉత్తీర్ణులయ్యేలా తర్ఫీదు
- 149 కేంద్రాల్లో పరీక్షలకు ఏర్పాట్లు
- కేంద్రాల వద్ద ప్రత్యేక వసతులు
- డిఇఒ గార పగడాలమ్మ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



విద్యార్థుల్లో పరీక్షల ఫీవర్ మొదలైంది. అందులో పదో తరగతి పరీక్షలంటేనే అత్యంత కీలకంగా భావిస్తారు. గతంలో కోవిడ్ కారణంగా ఎక్కువ కేంద్రాల్లో పరీక్షలను నిర్వమించే వారు. ఈ ఏడాది పరీక్షా కేంద్రాలను కుదించాం. ప్రభుత్వ పాఠశాలల్లోనే పరీక్షల నిర్వహణకు వీలుగా విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. పరీక్షల సమయం దగ్గరపడుతుండటంతో విద్యాశాఖ పరీక్షల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లు, తరగతుల నిర్వహణ, ముందస్తు పరీక్షల నిర్వహణ, తదితర అంశాలపై జిల్లా విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ ప్రజాశక్తి ముఖాముఖిలో తెలిపారు.



పదో తరగతి పరీక్షలకు సమయం దగ్గరపడుతున్న తరుణంలో విద్యాశాఖ ఎలాంటి చర్యలు చేపడుతోంది?

జిల్లాలో పది పరీక్షల కోసం విద్యాశాఖ ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే పరీక్షా కేంద్రాలను గుర్తించాం. అక్కడ మౌలిక సదుపాయాలు పరిశీలిస్తున్నాం. జిల్లాలో మొత్తం 561 ప్రభుత్వ , ప్రయివేటు పాఠశాలల నుంచి 29,545 మంది పది పరీక్షలు రాసేందుకు సన్నద్ధమవుతున్నారు. పాఠశాల విద్యాశాఖ ఏప్రిల్ 3 నుంచి పది పరీక్షలు నిర్వహించేందుకు షెడ్యూల్‌ను ప్రకటించింది. ఇప్పటికే టైంటేబుల్ విడుదల చేశాం. ఏప్రిల్ 18 వరకు పరీక్షలు కొనసాగుతాయి. అందులో భాగంగా ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం. గతంలో కోవిడ్ కారణంగా పరీక్షా కేంద్రాల సంఖ్యను పెంచి భౌతిక దూరం పాటించేలా తగిన జాగ్రత్తలు తీసుకున్నాం. పర్యవేక్షణ కొంత ఇబ్బందిగా ఉన్నా ఎక్కువ మందిని నియమించి పర్యవేక్షించడం జరిగేది. కానీ ప్రస్తుతం సాధారణస్థితి నెలకొనడం వల్ల గతంలో ఉన్న కేంద్రాల సంఖ్యను తగ్గించడం జరిగింది.

జిల్లాలో ఎన్ని పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు?

విద్యార్థుల సంఖ్యను బట్టి పరీక్షా కేంద్రాలను తగ్గించాం. కోవిడ్ కారణంగా గతేడాది ఎక్కువ కేంద్రాలను ఏర్పాట్లు చేయాల్సి వచ్చింది. ఈ సారి 149 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధం చేస్తున్నాం. కేటగిరిల వారీగా కేంద్రాలను ఏర్పాటు చేసి విద్యార్థుల సంఖ్య కేటాయించడానికి చర్యలు చేపడుతున్నాం. ఇందులో ఎ-కేటగిరి కేంద్రాలు 57, బి-కేటగిరి 29, సి-కేటగిరి 63 గుర్తించి పరీక్షల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

పరీక్షలకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారా?

ప్రభుత్వ బడుల్లో చదువుతూ పదో తరగతి పరీక్షలు రాయనున్న ప్రతి విద్యార్థీ ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికాబద్ధంగా తరగతులు నిర్వహించడం జరిగింది. ప్రస్తుతం పునశ్చరణ తరగతులు జరుగుతున్నాయి. ముందస్తు సన్నద్ధత కోసం తరగతులతో పాటు పరీక్షల నిర్వహణ జరుగుతోంది. వెనుకబడ్డ విద్యార్థులపై మరింత శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు ఇప్పటికే సూచించడం జరిగింది. పాఠశాల స్థాయిలో అన్ని రకాలైన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. చదివించడం తల్లదండ్రుల బాధ్యత. మరోవైపు నిపుణులు తయారు చేసిన ప్రశ్నాపత్రాలను సాధన చేయడం జరుగుతోంది. ఎంపిక చేసిన అంశాలపై పట్టు సాధించేలా తర్ఫీదు ఇస్తున్నాం. దీని ద్వారా మంచి ఫలితాలు వస్తాయని భావిస్తున్నాం.

వెనుకబడిన విద్యార్థులపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

గతేడాది కరోనా ప్రభావం, తరగతుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల ఆశించిన స్థాయిలో పదో తరగతిలో ఉత్తీర్ణతా శాతం తగ్గింది. కానీ ఈసారి అలా కాకుండా శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ముందుగా లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం జరిగింది. అందుకనుగుణంగా ప్రణాళికా బద్ధంగా తరగతుల నిర్వహణ, వారి నుంచి పునశ్చరణ వంటి జాగ్రత్తలు తీసుకున్నాం. అందువల్ల మెరుగైన ఫలితాలు ఈ సారి సాధించగలమని నమ్మకం ఉంది. అందుకు తగ్గట్లు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఇటీవల నిర్వహించిన సమ్మెటివ్, ఫార్మెటివ్ పరీక్షల్లో సి, డి గ్రేడుల్లో నిలిచిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. దీనిపై ఇప్పటికే హెచ్‌ఎంకు పలు సూచనలు చేయడం జరిగింది.

తరగతుల నిర్వహణలో పర్య వేక్షణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

పదో తరగతి విద్యార్థులకు సంబంధించి పాఠశాలల్లో అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాల పర్యవేక్షణపై దృష్టి పెడుతున్నాం. నాతో పాటు సమగ్రశిక్ష ఎపిసి, ఉపవిద్యాశాఖాధికారులు, మండల విద్యా శాఖాధికారులు, సీనియర్ ప్రధానోపాధ్యాయులు తనిఖీలకు వెళున్నారు. అమలులో ఎక్కడా లోపం లేకుండా చూస్తున్నాం. లోటుపాట్లు ఉంటే వాటిని సరిదిద్దడం, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేయడం జరుగుతోంది.

పరీక్షల నిర్వహణకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ఇప్పటికే మండల స్థాయి అధికారులకు, పరీక్షా కేంద్రాల నిర్వహణకు ఎంపిక చేసిన స్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశాం. తాగునీరు, మరుగుదొడ్ల వంటి మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలి. తరగతి గదుల్లోకి వెలుతురు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే వాటిని సరి చేసుకోవడం, కేంద్రాల్లో స్వల్పమార్పులు చేసుకునేందుకు వీలుంటుంది. ఆ దిశగా ఉన్నత స్థాయిలో పర్యవేక్షణ జరుగుతోంది.

అభివృద్ధికి పెద్దపీట

మంత్రి ధర్మాన ప్రసాదరావు


పార్కును ప్రారంభిస్తున్న ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అభివృద్ధి పనులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, మూడున్నరేళ్లలో ఎన్నడూ జరగని రీతిలో పనులు చేపట్టామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. చల్లా నరసింహారావు చిల్డ్రన్ పార్కును, రూ.1.50 కోట్లతో కలెక్టరేట్ నుంచి కొత్తపేట వరకు నిర్మించిన రోడ్డును ఆయన ఆదివారం ప్రారంభించారు. ధర్మాన మాట్లాడుతూ పట్టణంలో ఇవాళ ప్రభుత్వ పాఠశాలలను ఎంతగానో అభివృద్ధి చేశాం. ఇవన్నీ పెద్ద మార్పు. ఇవన్నీ మూడున్నరేళ్లలో వచ్చిన మార్పు. పూర్వం మాదిరిగా కాకుండా ఎక్కడికక్కడ సచివాలయాలు పనిచేస్తున్నాయి. ఇదంతా మార్పు కారణంగా అందుబాటులోకి వచ్చిన స్థానిక పాలన అని అన్నారు. ప్రజలకు డబ్బు ఇస్తే దుబారా అంటున్నారు. ఏ ఆసరా లేని స్త్రీకి డబ్బులు ఇవ్వడం దుబారా అంటే ఎలా? అని ప్రశ్నించారు. అమ్మఒడి కింద డబ్బులు వేసి, నీ పిల్లాడిని స్కూల్‌కు పంపు, బడికి పంపు అని చెప్పడం దుబారా అంటే ఎలా అని అన్నారు. కరోనా కలంలో అన్ని వర్గాలను ఆదుకున్నామని చెప్పారు. ప్రజా స్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని చెప్పారు. విశాఖ బీచ్‌ను పోలినట్లు పెద్దగన్నగళ్లవానిపేట బీచ్‌ను అభివృద్ధి చేయాలన్నదే నా ఆకాంక్ష అని అన్నారు. కార్యక్రమంలో ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, కమిషనరు ఒబులేసు, అంధవరపు సూరిబాబు, మెంటాడ పద్మావతి, ఎ.శ్రీనివాసరావు, చల్లా శ్రీనివాసరావు, జి.వాసు, శిమ్మ రాజశేఖర్, తాతబాబు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



దాసరికి పుస్తకాన్ని అందజేస్తున్న అప్పలనాయుడు

సామాజిక పురోగమనమే అభ్యుదయం

రచయిత అప్పలనాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమాజాన్ని ముందుకు నడిపించడం, వివక్షతలు లేని సమాజం కోసం కృషి చేయడమే అభ్యుదయమని ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు అన్నారు. ఆ ఆశయంతోనే 80 ఏళ్ల నుంచి అభ్యుదయ రచయితల సంఘం సాహిత్యం ద్వారా కృషి చేస్తుందని చెప్పారు. నగరంలోని క్రాంతి భవన్‌లో అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి చింతాడ కృష్ణారావు అధ్యక్షతన జిల్లా తొలి మహాసభ ఆదివారం నిర్వహించారు. ముందుగా కళింగాంధ్ర నవల గురించి మాట్లాడారు. బలివాడ కాంతారావు, ఘండికోట బ్రహ్మాజీరావు, రావిశాస్త్రి వంటి రచనల్లోని కళింగాంధ్ర వెనుకబాటు తనం, దోపిడీ, అమాయకత్వం, వలసలు, వర్తమాన స్థితి గతులను వివరించారు. అరసం జిల్లా అధ్యక్షుడు నల్లి ధర్మారావు తెలుగు సాహిత్య రంగ చరిత్రలో ఉత్తరాంధ్ర పాత్రను వివరించారు. ఈ సభలో కథ గురించి దాసరి రామచంద్రరావు, ప్రాచీన సాహిత్యం గురించి గార రంగనాథం, రంగస్థలం గురించి చిట్టి వెంకటరావు, అవధాన సాహిత్యం గురించి మరడాన శ్రీనివాసరావు, బుర్రకథపై పేడాడ ధనుంజయరావు, హరికథపై బుసకల రంగారావు, భాగవతార్, గురజాడ దృక్పథంపై పత్తి సుమతి మాట్లాడారు. సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాస్, తెరవే అధ్యక్షుడు ఉత్తరావిల్లి నాగేశ్వరరావు, ఇస్కఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బుడుమూరి శ్రీరామ్మూర్తి, విద్యాధరి విద్యా సంస్థల అధినేతలు డాక్టర్ జామి భీమశంకరరావు, డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు, జిల్లా అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి సనపల నర్సింహులు, జర్నలిస్టుల సంఘం రాష్ట్ర నాయకుడు ఎన్.ఈశ్వరరావు సందేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో అరసం జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ జ్యోతిఫ్రెడరిక్, జిల్లా కార్యదర్శి కలమట దాసుబాబు, ఇస్కఫ్ జిల్లా కార్యదర్శి జి.వి.నాగభూషణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేష్

క్యాషు అసోసియేషన్ అధ్యక్షుడుగా సురేష్

పలాస: పలాస క్యాషు అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ అసోసియేషన్ ఎన్నికలో క్యాషు అసోసియేషన్ అధ్యక్షుడుగా మల్లా సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎలక్షన్ బోర్డు చైర్మన్ బెల్లాల నారాయణరావు, మాజీ ప్రెసిడెంట్, మాజీ ఎలక్షన్ బోర్డు చైర్మన్ మల్లా సూర్యనారాయణ గుప్తా, శాసనపురి మురళీకృష్ణ సభ్యులు సమక్షంలో క్యాషు అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. 2023-25 వరకు అధ్యక్షులుగా మల్లా సురేష్ కుమార్, కార్యదర్శిగా కె.వి.శివకృష్ణ, కోశాధికారి పట్నన రవికాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మేలు కంటే... అవస్థలే ఎక్కువ

- అండర్ టన్నల్‌లో నిరంతం నిల్వ ఉన్న నీరు
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- కోట్లాది రూపాయలు నిరుపయోగం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని చర్చి ఎదురుగా ప్రజల రాకపోకలకు అనుకూలంగా రైల్వే శాఖ కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించిన అండర్ టన్నెల్ రహదారితో ప్రజలు నిత్యం నరకాన్ని చవిచూస్తున్నారు. గతంలో బి.ఆర్.నగర్ ఎదురుగా ఒక రైల్వే క్రాసింగ్ గేటు ఉండేది. దానిని మూసివేసి గేటు వద్ద ఉన్న ఇందిరా గాంధీ విగ్రహం వద్ద కొత్తగా రైల్వే క్రాసింగ్ గేటును ఏర్పాటు చేశారు. తదన అనంతరం దాన్ని మూసివేసి అండర్ టన్నెల్ రహదారిని నిర్మించారు. ఈ రహదారితో ప్రజలకు మేలు కంటే... అవస్థలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. నిత్యం నీటితో నిండి ఉండడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం నీరు ఉండడంతో



అండర్ టన్నల్‌లో పట్టిన నాచు

రోడ్డుపైన నాచు తేరడంతో ద్విచక్ర వాహనదారులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే నీరు ఎక్కువగా నిల్వ ఉండడం వల్ల ద్విచక్ర వాహనదారులు ఈ దారిలో ప్రయాణించడంత్తో నీరు వాహనాల ఇంజిన్‌లోకి చొచ్చుకుపోయి మొరాయిస్తున్నాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురై చేతి చమురు వదిలించుకుంటున్నారు. డివిజనల్ రైల్వే మేనేజర్ శ్రీకాకుళం రోడ్డు పర్యటనకు వచ్చిన ప్రతిసారీ ప్రజా సంఘాలు, పలు పార్టీల ప్రతినిధులు సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్తున్నారు. త్వరలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం షరా మామూలే అని ప్రజలు పెదవి విరుస్తున్నారు. పలుమార్లు స్పీకర్, ఎంపీ, డిఆర్ఎంతో సమావేశాలు పెట్టి అండర్ టన్నెల్ రహదారిని పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని హామీలు ఇస్తున్నారు. కానీ, దానిపై దృష్టి పెట్టిన దాఖలాలు ఇంత వరకు లేవని వారి పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలంలోనే నీటి నిల్వలతో పలు ఇక్కట్లు ఎదుర్కొంటున్న ప్రజలు... వర్షాకాలం వస్తే ఈ రహదారిని మరిచిపోవాల్సిందే. అండర్ టన్నెల్‌లోని నిల్వ నీటిని మోటార్లు పెట్టి తోడేందుకు రైల్వేశాఖ కాంట్రాక్టర్‌కు లక్షల రూపాయలను చెల్లిస్తుంది. అయినా సక్రమంగా నీటిని తోడటం లేదని పలువురు వాపోతున్నారు. కాంట్రాక్టర్ విశాఖపట్నంలో నివాసం ఉంటూ ఇక్కడ ఒకే ఒక్కడితో నీటిని తోడించే పనిని చేపడుతున్నారు. రాత్రిపూట అండర్ టన్నెల్ నుంచి ద్విచక్ర వాహనాలతో ప్రయాణిస్తే నీరు ఇంజిన్‌లోకి పోయి వాహనాలు మొరాయిస్తున్నాయని వాహనదారులు ఆవేదన



అండర్ టన్నల్‌లో నిరంతరం నిల్వ ఉన్న నీరు

వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ రహదారి మీదుగా ప్రయాణం చేస్తున్న వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అండర్ టన్నెల్‌లో నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని పలువురు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా...

అండర్ టన్నల్‌లో నీరు నిల్వ ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను పలుమార్లు రైల్వే ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు దృష్టికి తీసుకెళ్లా. అయినా సమస్య పరిష్కారం కాలేదు. ప్రజా సంఘాలు, విపక్ష నేతలతో కలిసి చాలాసార్లు వినతి పత్రాలు అందించాం. అవి బుట్ట దాఖలు అయ్యాయి తప్ప ఎటువంటి ప్రయోజనం చేకూరలేదు. అండర్ టన్నల్‌లో నుంచి ప్రయాణం చేయాలంటే అవస్థలు తప్పడం లేదు.

- బొడ్డేపల్లి మోహనరావు,
సీనియర్ సిటిజన్ ఫోరం ప్రధాన కార్యదర్శి

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

వ్య.కా.స. జిల్లా ప్రధాన కార్యదర్శి సింహాచలం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని శ్రీనివాసచార్యులుపేట పంచాయతీ మండాది వద్ద శనివారం లారీ ఢీకొని మృతి చెందిన ఉపాధి కూలీల కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆదివారం మండాది గ్రామాన్ని సందర్శించి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మృతి చెందిన మహిళలందరూ నిరుపేద కుటుంబీకులకు చెందిన వారని, వారి మృతితో ఆయా కుటుంబాలు వీధిన పడ్డాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రమాదం సంభవించిన సమయంలో కూతవేటు దూరంలో ఉన్న జగ్గుశాస్త్రులపేటలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారని, కనీసం



పోతురాజుని ఓదార్చుతున్న సింహాచల

ఆ సమయంలో మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చడానికి, పరామర్శించడానికి సమయం దొరకలేదంటే పేదలపై, దళితులపై ఆయన చిత్తశుద్ధి ఏమిటో ఇట్టే అర్థం చేసుకోవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. ఓట్లు, సీట్లు, ప్రచార ఆర్భాటం తప్ప పేదలపై జాలి, కరుణ లేకపోవడం శోచనీయమన్నారు. పేదలు, దళితులపై ఈ ప్రభుత్వానికి ఉన్న గౌరవం ఏమిటో ఈ సంఘటనతో రుజువైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని మృతి చెందిన వారి కుటుంబాలకు బాసటగా నిలవాలని అన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

టెక్కలి: జాతీయ ఉపకార వేతనం ప్రవేశ పరీక్ష (ఎన్ఎంఎంఎస్) పరీక్ష ఆదివారం టెక్కలిలో ప్రశాంతంగా జరిగింది. టెక్కలి డివిజన్ పరిధిలోని 11 మండలాల నుంచి 8వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు రాశారు. పట్టణంలోని 12 కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 2,800 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 73 మంది గైర్హాజరయ్యారు. డివిజన్ స్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షలను డిసిఇబి చైర్మన్ డి.వి.లక్ష్మీనరసింహమూర్తి, డిఇఒ డి.నాగభూషణరావు పర్యవేక్షించారు. పరీక్షల నిర్వహణపై సంతృప్తిని వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణను టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖ కార్యాలయ సిబ్బంది భాస్కరరావు, కుప్పిలి నగేష్, కుప్పిలి ప్రకాష్, చిత్రాడ రమేష్ ఏర్పాట్లు చేశారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

క్రైమ్ కార్నర్

భర్త వేధింపులు తాళ్లలేక భార్య ఆత్మహత్య

ప్రజాశక్తి- జలుమూరు



నిర్మల (ఫైల్)

భర్త వేధింపులు తలలేక భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కరవంజ పంచాయతీ పరిధి మట్టవానిపేటలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు కథనం మేరకు... మట్టవానిపేటకు చెందిన మొగులపల్లి నిర్మలకు పాతపట్నం మండలం కోయకొండకు చెందిన మొగులపల్లి నందీశ్వరరావుతో 2017లో వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. కొన్నాళ్లకు నందీశ్వరరావు చెడు వ్యసనాలకు బానిసై నిర్మల మగపిల్లాడిని కనలేదని మానసికంగా, శారీరకంగా హింసించేవాడు. తనకు ఆరోగ్యం బాగా లేదని చెప్పినా చస్తే చాలు నీ పీడ వదిలిపోతుందని తరచూ అంటూ ఉండేవాడు. అనంతరం తన పిల్లలను తీసుకుని కన్నవారిల్లు మట్టవానిపేటకు చేరుకుంది. ఈ నేపథ్యంలో పిల్లలను తీసుకుని వెళ్లమని నందీశ్వరరావుకు నిర్మల ఫోన్ చేసినా నీ చావు నీవు చావు నేను పిల్లలను తీసుకుని వెళ్లనని ఖరాకండిగా నందీశ్వరరావు చెప్పాడు. దీంతో మనస్తాపన చెందిన నిర్మల శనివారం అర్ధరాత్రి ఇంట్లో ఉన్న శ్లాబ్ హుక్‌కు చున్నీతో ఉరి వేసుకుంది. ఆదివారం ఉదయం చూసేసరికి వేలాడుతూ కనిపించిన కుమార్తెను చూసి గుండెలవిసేలా విలపించారు. వెంటనే గ్రామస్తులు మృతదేహాన్ని కిందకు దించి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికితరలించారు. మృతురాలి తండ్రి తూము రామారావు ఇచ్చిన ఫిర్యాదు ఎస్ఐ పి.పారినాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు. తల్లి మృతితో ఇద్దరు కుమార్తెలు బేలచూపులు చూస్తున్నారు.



సావిత్రమ్మ మృతదేహం

గాయపడిన వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని గొప్పిలికి చెందిన కోట సావిత్రమ్మ (76) ఈ నెల 1న వంట చేస్తుండగా... చీరకు నిప్పంటుకోవడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే కుటుంబ సభ్యులు విశాఖ కెజిహెచ్‌లో చేర్పించారు. నాలుగు రోజుల పాటు చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడింది. శనివారం పరిస్థితి విషమించి మృత్యువాత పడింది. అక్కడ నుంచి ఆదివారం జిల్లా సర్వజనాస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఎఎస్ఐ నర్సింగరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలో అక్కవరం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... బి.కావేశ్వరరావు తన ద్విచక్రవాహనంపై శ్రీకాకుళం వైపు వెళ్తున్నాడు. మండలంలోని పాతనౌపడ విఆర్ఒగా విధులు నిర్వహిస్తున్న నాగరాజు తన ద్విచక్ర వాహనంపై టెక్కలి వస్తుండడంతో ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదంచోటు చేసుకుంది. వెంటనే స్థానికులు క్షతగాత్రులను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ ఎల్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడికి...

టెక్కలి రూరల్ : తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా పకోడి దుకాణంలో గోడపై నుంచి జారిపడి డైన కేశవస్వామి సాహు కాలుకి గాయమైంది. కిందనున్న ఇనుప రాడ్డుపై పడడంతో కాలు నుజ్జునుజ్జయ్యింది. వెంటనే కుటుంబ సభ్యులు 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. విఆర్ఒ శ్యామ్ కుమార్ ఆస్పత్రికి వెళ్లి పరామరించారు. దగ్గరుండి వైద్య సిబ్బందితో చికిత్స అందించారు.

అల్లెన ఎంపిటిసి మృతి



శ్రీరామ వరప్రసాదమ్మ (ఫైల్)

బూర్జ : మండలంలోని అల్లెన ఎంపిటిసి, టిడిపి మండల అధ్యక్షులు వావిలపల్లి సీతారాం బాబు (రాంజీ) మాతృమూర్తి వావిలపల్లి శ్రీరామ వరప్రసాదమ్మ (64) ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. ఈమె మూడు పర్యాయాలు ఎంపిటిసి పనిచేశారు. 1988 ఆముదలవలస నియోజకవర్గంలో ఏకగ్రీవంగా ఎంపికైన ఒకే ఒక్క ఎంపిటిసి. 2001లో ఎంపిటిసిగా ఎన్నికై సేవలు అందించారు. ఆమె మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.



దహన సంస్కారాలకు సిద్ధం చేస్తున్న కుటుంబ సభ్యులు

స్వగ్రామంలో అంత్యక్రియలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని శ్రీనివాసచార్యులపేట పంచాయతీ మండాది వద్ద శనివారం లారీ ఢీకొని నలుగురు ఉపాధి కూలీలు మృతి చెందిన విషయం విదితమే. జిల్లా సర్వజనాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి ఆదివారం నాలుగు మృతదేహాలను అంబులెన్స్‌లో స్వగ్రామానికి తీసుకురావడంతో ఒక్కసారిగా అక్కడ రోదనలు మిన్నంటాయి. నిన్నటి వరకు తమతో కలిసి మెలసి ఉన్న వారు విగత జీవులుగా పడి ఉండటం చూసి తోటి మహిళలు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుల కుటుంబ సభ్యులు గతాన్ని తలుచుకుంటూ రోధిస్తుండటం అక్కడ ఉన్న వారిని కలచివేసింది. వారి రోదనలు ఆపడం ఎవరి తరమూ కాలేదు. రోదనలతో కొద్దిసేపు అక్కడ గందరగోళం నెలకొంది. అనంతరం విషాద వదనంతో శ్మశాన వాటికలో మృతదేహాలను ఆయా కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

బుద్ధుని విగ్రహం ఆవిష్కరణ



మాట్లాడుతున్న శ్రీకాంత్

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1989-90లో పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశాఖపట్నం పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ చేతుల మీదుగా బుద్ధిని విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు నాలుగు రోడ్ల కూడలి వద్ద ఐఆర్ఎస్ అధికారి బి.సత్యనారాయణ ఆధ్వర్యాన పూర్వ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అలాగే అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అక్కడ నుంచి పంచముఖ ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2008లో శ్రీకాకుళం ఎస్పిగా పనిచేశానని గుర్తు చేశారు. ఈ సమయంలో కొత్తూరు, భామిని మావోయిస్టుల ప్రభావిత ప్రాంతంగా పేరుండేదని అన్నారు. ప్రతిఒక్కరూ బుద్ధిని సూత్రాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ బి.శ్రీధర్, ప్రిన్సిపాల్ బండారు రవికుమార్, విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు ఎ.గోపాల్‌దాస్ నాయుడు, అధ్యాపకులు కోడూరు గోవిందరావు, టి.ఆదినారాయణ, దళిత నాయకులు డి.జమ్మయ్య, బి.కృష్ణారావు, కళాశాల చైర్మన్ సారిపిల్లి కృష్ణవేణి పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- పలాస

మండలంలోని శాసనాం గ్రామ సమీపంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలాస నియోజకవర్గంలో నూతన పార్టీ భవన నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి చేసేందుకు మనమంతా కలిసి కట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు,



శంకుస్థాపన చేస్తున్న గౌతు శిరీష

గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, అంబటి కృష్ణమూర్తి, బి.నాగరాజు, ఎస్.నవీన్, కొవ్వూరు సురేష్, జోగ మల్లి, డొక్కరి శంకర్, ఆత్మారావు, కుత్తుం లక్ష్మణ్‌కుమార్, దువ్వాడ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.



పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు

పుస్తక ప్రదర్శన

లావేరు : ప్రతి విద్యార్థీ పుస్తకాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని మురపాక శాఖాగ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. గ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నెలా మొదటి ఆదివారం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహిస్తామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రదర్శనలో రామాయణం, మహాభారతాలతో పాటు చరిత్ర, సైన్స్, బాల సాహిత్యం, ఇలా నాలుగు వందల పుస్తకాలను ప్రదర్శనలో ఉంచామని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు జి.షణ్ముఖరావు పాల్గొన్నారు. అలాగే లావేరు శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్లలో సౌకర్యాలు కల్పించాలి

ఇచ్ఛాపురం : జగనన్న లేఅవుట్లలో ఎన్నిసార్లు లబ్ధిదారులకు అవగాహన కల్పించినా లబ్ధిదారులు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారని సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు అర్బన్ హౌసింగ్ అధికారి సిహెచ్.మల్లేశరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి శనివారమూ మండలంలోని, మున్సిపాలిటీ పరిధిలో అన్ని జగనన్న కాలనీల్లో అనేక అవగాహన సమావేశాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కానీ, కొన్ని లే అవుట్లలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడం లబ్ధిదారులు ముందుకు రావడం లేదన్నారు. హౌసింగ్ శాఖ తరుపున ఎంత కృషి చేసినా ప్రయోజనం ఉండడం లేదని వివరించారు. మిగిలిన శాఖల అధికారులు ముందుకొచ్చి కాలనీ వాసులకు కావాల్సిన కనీస సౌకర్యాలు కల్పించాలని ఉన్నతాధికారులను కోరినట్లు తెలిపారు. ఉగాది నాటికి గృహ ప్రవేశాలు జరగాలన్న ప్రభుత్వ నిర్ణయానికి కనీస సౌకర్యాలు కల్పిస్తేనే ఇళ్ల నిర్మాణాలు పూర్తవుతాయని అన్నారు. హౌసింగ్ తరుపున బిల్లులు సకాలం చెల్లిస్తున్నామని అన్నారు. సచివాలయం సిబ్బంది, వాలంటీర్ల నుంచి లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులూ లేవని, మిగిలిన శాఖాధికారులు స్పందించి తాగునీరు, విద్యుత్, ఇన్నర్ రోడ్లు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు.

హామీలన్నీ అమలు

శాసనసభ స్పీకర్ సీతారాం



పొందూరు : మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

సిఎం జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ అమలయ్యాయని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని జెవిఆర్ కళ్యాణమండపంలో సచివాలయ కన్వీనర్లకు, గృహసారథులకు, వాలంటీర్లకు ఆదివారం శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గృహసారథులు, వాలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారదులని అన్నారు. పార్టీ విజయానికి కలిసికట్టుగా ఉంటూ సైనికుల్లా పనిచేయాలన్నారు. నియోజకవర్గం పార్టీ పరిశీలకులు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురామరాజు మాట్లాడుతూ చంద్రబాబునాయుడుకు చిత్తశుద్ధితో ప్రజలకు సేవ చేయాలన్నా ధ్యాస కన్నా అడ్డదారిలో అధికారంలోకి రావాలన్న ఆలోచన ఎక్కువగా ఉందన్నారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, మేజర్ పంచాయతీ సర్పంచ్ రేగడి లక్ష్మి, మండల సమన్వయకర్త బాడాన కృష్ణారావు, జామి వెంకటరమణ, గాడు నాగరాజు, వండాన సూరపనాయుడు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

టెక్కలి రూరల్ : సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు కృషి చేయాలని ఉత్తరాంధ్ర జిల్లాల కో-ఆర్డినేటర్ హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. టెక్కలి వైసిపి కార్యాలయంలో ఆవరణంలో జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెక్కలి నియోజకవర్గం వైసిపిని గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఎంపిపి అట్లా సరోజినమ్మ, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి, వైస్ ఎంపిపి మన్నెల కిషోర్, సర్పంచ్ గొండెల సుజాత, చింతాడ గణపతి, తిర్లంగి జానికిరామయ్య, మండల కన్వీనర్ బగాది హరి, జెసిఎస్ మండల కో-ఆర్డినేటర్ సిహెచ్.మోహనరావు పాల్గొన్నారు.

కవిటి తహశీల్దార్‌ను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి- పలాస

నిబంధనలు అతిక్రమించి బెంతు ఒరియా కులధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన సచివాలయం ఉద్యోగస్తులను, కవిటి తహశీల్దార్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని ఆదివాసీ జెఎసి జిల్లా అధ్యక్షులు సవర రాంబాబు డిమాండ్ చేశారు. పలాసలో ఆదివాసీల జెఎసి ఆధ్వర్యాన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీ నాయకుడు వాబ యోగిపై బెదిరింపులు పాల్పడుతున్న వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో బెంతు ఒరియాలు లేరని దశాబ్దాల కాలం నుంచి పోరాటం చేస్తున్న ఆదివాసీ సంఘం నాయకులపై నకిలీ బెంతు ఒరియాలు (వడ్డి/ఒరియా) బరితెగించి ఫోన్ చేసి బెదిరింపులు



మాట్లాడుతున్న రాంబాబు

పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నకిలీ బెంతు ఒరియా విషయంపై ప్రభుత్వం కమిషన్ వేసిన విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. వన్ మ్యాన్ కమిషన్ జిల్లాలో పర్యటన చేసి అధ్యయనం చేసి, విచారణ కొనసాగుతుందని చెప్పారు. ఈ సమస్య ప్రభుత్వ దృష్టిలో ఉందన్నారు. ఈ తరుణంలో బెంతు ఒరియాలకు గత నెల 28న కవిటి మండల తహశీల్దార్ ఆర్.అప్పలరాజు ఎస్‌టి ధ్రువీకరణ పత్రాలు మొత్తం 8 మంజూరు చేశారని అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారంగా జిల్లాలో నిజంగా బెంతు ఒరియాలు ఉంటే వారికి కులధ్రువీకరణ పత్రాల అందజేసే అధికారం రెవిన్యూ డివిజన్ అధికారికి మాత్రమే ఉందన్నారు. అక్రమంగా ఇచ్చిన ఎస్‌టి కులధ్రువీకరణ పత్రాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై గత నెల 31న కలెక్టర్‌కు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి ఫిర్యాదు చేశారని చెప్పారు. యోగికి ఫోన్ చేసి అంతు చూస్తామని, నిన్ను లేపేస్తామని బెదిరింపులు పాల్పడుతుండడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎఐఎఇఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సవర జగన్నాయుకులు, వాబ యోగేశ్వరావు, సవర భాస్కరరావు, కృష్ణారావు, సవర గణేష్, సవర హేమలత, సుందరాడ యర్రంన్నాయుడు పాల్గొన్నారు.

ఉప్పినవలసలో నేత్ర వైద్య శిబిరం

బూర్జ: మండలంలోని ఉప్పినివలసలో వైఎస్ఆర్ కంటి వెలుగు పథకంలో భాగంగా ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ నేత్ర ఆస్పత్రి నేతృత్వంలో సత్యసాయి సేవా సమితి ఆలయ ప్రాంగణంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆప్తాలమిక్ 78 మందికి నేత్రాలను పరీక్షించారు. అందులో 23 మందికి శస్త్ర చికిత్స కోసం విశాఖపట్నంకు తరలించారు. ముందుగా ఆముదాలవలస జోనల్ కో-ఆర్డినేటర్ ఎం.రవీంద్రబాబు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఆప్తాలమిక్ అసిస్టెంట్ ఎం.రాజేశ్వరి, అసిస్టెంట్ రామారావు, కె.సోమేశ్వరరావు, మండల కన్వీనర్ అల్లాడ సింహాచలం, రవి విశ్వేశ్వరయ్య, సేవా సంఘం అధ్యక్షులు వీర్రాజు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

డ్వామా పీడీ

ఆమదాలవలస : మండలంలోని శ్రీనివాసాచార్యులపేట పంచాయతీ మండాది వద్ద లారీ ఢీకొని నలుగురు ఉపాధి హామీ కూలీలు మృతి చెందిన విషయం విదితమే. ఈ మేరకు మృతుల కుటుంబ సభ్యులను డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు ఆదివారం పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను ఆదుకుంటామని హామీనిచ్చారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఎక్స్‌గ్రేషియాను త్వరలో అందజేస్తామని తెలిపారు. ఈయన వెంట ఎపిఒ ఎస్.లక్ష్మీనర్సమ్మ, వైసిపి నాయకులు గురుగుబెల్లి ప్రభాకరరావు, ఇసి గట్టి రాము, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న గాంధీ

గాంధీ పరామర్శ


మృతుల కుటుంబ సభ్యులను వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ పరామర్శించారు. మతదేహాలు గ్రామానికి చేరుకున్న నుంచి అంత్యక్రియలు పూర్తయ్యే వరకు అక్కడే ఉండి సహాయ సహకారాలను అందించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు.

ఆదుకోవాలి : జనసేన

మృతుల కుటుంబాలను జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబాల మహిళలు మృతి చెందడం తనను కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ కుటుంబాలను ఎక్స్‌గ్రేషియా ప్రకటించి వారిని ఆదుకోవాలని కోరారు.



పరామర్శిస్తున్న పీడీ చిట్టిరాజు



పరామర్శిస్తున్న రామ్మోహనరావు



వైద్యులతో మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

ఎంపీ పరామర్శ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఇటీవల సంభవించిన రోడ్డు ప్రమాదంలో టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్ గాయపడి చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు మెడికవర్ ఆస్పత్రికి ఆదివారం వెళ్లి వెంకటేష్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆయనతో పాటు టిడిపి నాయకులు కొర్ను ప్రతాప్, అరవల రవీంద్ర ఉన్నారు.

రామ్‌మల్లిక్ నాయుడు...

లావేరు : మండలంలోని చిన్నమురపాక మాజీ సర్పంచ్ సీరిపురపు జగన్నాథం అనారోగ్యానికి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు ఆదివారం జగన్నాథంను పరామర్శించారు. ఆరోగ్య సమస్యలను తెలుసుకుని త్వరగా కోలుకుని ఆకాంక్షించారు. ఈయన వెంట టిడిపి నాయకులు ఆర్.ప్రకాశరావు, గొర్లె శ్రీనివాసరావు, బోర శ్రీనివాసరావు, కొమ్ము సూర్యనారాయణ, మజ్జి సురేష్, కెల్లా హేమంత్, గొర్లె మోహన్ ఉన్నారు. అలాగే బిజెపి మండల అధ్యక్షులు ఇజ్జాడ శ్రీనివాసరావు కూడా పరామర్శించారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి శ్రీనివాసరావు

200 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం రూరల్ మండలం టి.మన్నయపేటలో నగరంలోని సన్‌రైజ్ ఆస్పత్రి యాజమాన్యం ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆస్పత్రి వైద్యులు డాక్టర్ శ్రీనివాసరావు 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తులు సీజనల్ వ్యాధులైన జలుబు, దగ్గుతో ఎక్కువ మంది బాధపడుతున్నారని, వారికి వైద్యం అందించడానికి ఈ శిబిరం ఎంతగానో ఉపయోగపడిందని అన్నారు. అలాగే దీర్ఘకాలిక సమస్యలైన బిపి, సుగర్ వ్యాధులున్న వారికి పరీక్షలు నిర్వహించడంతో వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకు వీలు కలిగిందని అన్నారు. ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కుమార్‌నాయక్‌కు లయన్స్ క్లబ్ అవార్డు

ప్రజాశక్తి- పలాస



అవార్డు అందుకుంటున్న కుమార్‌నాయక్

లయన్స్ క్లబ్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం, మంచి సేవలు అందించేందుకుగాను కుమార్ నాయక్‌కు లయన్స్ అవార్డు లభించింది. శ్రీకాకుళం బ్లూ ఎర్త్ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ రీజినల్ జోన్ వన్ ఫంక్షన్ నిర్వహించారు. ఇందులో భాగంగా పలాస లయన్స్‌క్లబ్ సభ్యులు కుమార్‌నాయక్‌కు నగర కార్పొరేషన్ కమిషనర్ ఓబులేసు అవార్డును అందజేశారు. కుమార్ నాయక్‌కు అవార్డు రావడంపై పలాస లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.అప్పారావు, తమ్మినేని మాధవరావు, తెప్పల కృష్ణమూర్తి, డాక్టర్ ఆనందరావు, సిందిరి మధు అభినందనలు తెలిపారు.

దరఖాస్తులకు ఆహ్వానం

టెక్కలి : టెక్కలి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో టెక్కలి, సంతబొమ్మాళి మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పిఒ శోభారాణి ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కలి చెరువు గుట్టు కార్యకర్త (బిసి-బి), పెద్దరోకళ్లపల్లి సహాయకులు, భగీరథపేట మినీ అంగన్వాడీ కార్యకర్త, ఆకాశలక్కవరం, పోతునాయుడుపేట, అంట్లవరం సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ నెల 11లోగా దరఖాస్తులను అందజేయాలని కోరారు.

విద్య కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు గనిరాజు

ప్రజాశక్తి- పలాస

విద్య కార్పొరేటీకరణకు, కాషాయీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు గనిరాజు పిలుపునిచ్చారు. స్థానిక పిడిఎస్‌యు కార్యాలయంలో జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యారంగాన్ని భ్రష్టు పట్టిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగంలోకి విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తూ స్వదేశీ యూనివర్సిటీల ఉనికి ప్రశ్నార్థకం చేస్తూ యుజిసి విదేశీ విశ్వవిద్యాలయాల శాఖలను దేశంలోకి ఆహ్వానిస్తూ ముసాయిదా తయారు చేసిందన్నారు. దీన్ని విద్యార్థులు, మేధావులు వ్యతిరేకించాలన్నారు. రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అన్ని రకాల ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టులను



సమావేశంలో మాట్లాడుతున్న గనిరాజు

తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలన్నారు. ఈ శిక్షణ తరగతులకు ముందుగా బిగిపిడికిలి జెండాను రాష్ట్ర ఉపాధ్యక్షుడు జునైద్ భాష ఆవిష్కరించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వినోద్, జిల్లా అధ్యక్షులు రవి, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంకల మాధవరావు, కూర్మారావు, భీమన్న, విజయ్ పాల్గొన్నారు.

సయ్యద్‌ఖాన్ చెరువులో శ్రమదానం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో బెల్లుపడా కాలనీ సమీపంలో ఉన్న సయ్యద్‌ఖాన్ చెరువులో చెత్త మొక్కలు తొలగించేందుకు యువకులు ముందుకొచ్చారు. ఈ చెరువును పూర్తిగా నిర్లక్ష్యంతో అధికార యంత్రాంగం విడిచి పెట్టింది. 7, 8, 23 వార్డులకు చెందిన వందలాది మంది ప్రజలు వాడుకునే చెరువు నిర్లక్ష్యంగా వదిలి పెట్టడంతో యువకులు, పెద్దలు స్పందించారు. ఈ మేరకు ఆదివారం శ్రమదానం చేసి పిచ్చి మొక్కలను తొలగించారు. విశాలమైన చెరువు కావడంతో ఒక్క రోజుతో జరిగే పని కాదు. దీంతో దశల వారీగా శ్రమదానం చేయడానికి యువకులు నిర్ణయించారు. ఇటువల నిర్వహించిన కౌన్సెల్ సాధారణ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి చెరువు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. వచ్చే గ్రామ దేవత సంబరాలు సందర్భంగా చెరువు మరమ్మతులు చేపట్టినట్లయితే వార్డు



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న యువకులు

ప్రజలకు నీటి సమస్య తగ్గుతుందని మున్సిపల్ అధికారులకు చెప్పారు. అధికార యంత్రాంగం స్పందించి చర్యలు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తుంది. అంతవరకు ఆలస్యం కాకుండా యువత శ్రమదానం చేపట్టింది. మూడు వార్డులకు చెందిన యువకులు ముందుకు రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

డిసిసి అధ్యక్షులు సత్యవతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని డిసిసి అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. పురపాలక సంఘ పరిధిలోని 14, 15వ వార్డుల పరిధిలో ఉన్న ఐ.జె.నాయుడు కాలనీ, కొత్తకోట వారి వీధి ప్రాంతాల్లో రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో హథ్ సే హథ్ జోడో అభియాన్ పాద యాత్రను ఆదివారం నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అందజేశారు. రాష్ట్రానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దామని నినాదాలు చేస్తూ పాదయాత్రను కొనసాగించారు. వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి సిఎంగా చరిత్రలో మిగిలిపోతారని ఎద్దేవా



ఆమదాలవలస : పోస్టర్‌ను అందజేస్తున్న సత్యవతి

చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సనపల అన్నాజీరావు, పప్పల రమణ, లఖినేని నారాయణరావు, బస్వా షణ్ముఖరావు, బొత్స వెంకటరమణ, కూన సుందరరావు, గురుగుబెల్లి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- జి.సిగడాం

ఆనాటి జ్ఞాపకాలు ఎప్పటికీ మధురస్మృతులేనని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. జి.సిగడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983-84లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు దేశ విదేశాల్లోను, ప్రభుత్వ, ప్రయివేట్ రంగంలో స్థిరపడ్డారు. వారంతా ఆదివారం పాఠశాల ఆవరణంలో ఒకే చోట కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనాటి మరపురాని మధురమైన సంఘటనలు, చిలిపి చేష్టలను గుర్తుకు తెచ్చుకుని ఆద్యంతం ఉల్లాసంగా, సంతోషంగా గడిపారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సాయం చేస్తామని హామీనిచ్చారు. అనంతరం ఆనాటి విద్యార్థులకు చదువు చెప్పిన గురువులు సిఎ మాస్టర్, కాయల రమణ, భూపతి రమణ, జడ్డు శ్రీరామ్మూర్తి, జగదాంబ విశ్వేశ్వరరావు మాస్టార్లకు దుశ్శాలువతో సన్మానించి మెమోంటోలను అందజేశారు.

పలువురి ఆర్థికసాయం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని ముచ్చింద్ర పంచాయతీ బన్నీగానిపేటకు చెందిన గుడియా అర్జున్ సాహు కుటుంబానికి జనసేన పార్టీ నాయకులు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. ఐదేళ్ల క్రితం విద్యుదాఘాతంతో అర్జున్‌సాహు రెండు కాళ్లు పోయాయి. భార్య, ఇద్దరు పిల్లలతో జీవనం కష్టతరంగా మారింది. ఇల్లు కట్టుకోవడానికి డబ్బులు లేక రేకు షెడ్‌లో ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధనరెడ్డిలు రూ.8 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ముచ్చింద్ర



ఇచ్ఛాపురం : ఆర్థికసాయం అందజేస్తున్న జనసేన నాయకులు

జనసేన ఎంపిటిసి అభ్యర్థి శంకర్ రెడ్డి, కేదారిపురం యూత్ లీడర్ పవర్ రాజా, నూకరాజు, మోహన్, రాము తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు : ఆర్థికసాయం అందజేస్తున్న సాయిగణేష్

ఎంజిఆర్...

కొత్తూరు : మండలంలోని ఇరపాడులో రాజరాఘవ రామచంద్రస్వామి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు టిడిపి నాయకులు, సామాజికవేత్త మామిడి గోవిందరావు తనయుడు డాక్టర్ సాయిగణేష్ పాల్గొన్నారు. ఈ మేరకు ఆలయాభివృద్ధికి రూ.20 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఎల్‌ఎన్‌పేట మండల మాజీ అధ్యక్షులు వెలమల గోవిందరావు, ఆరుబోలు దశరథ, ఎంజిఆర్ యువసేన అధ్యక్షులు పోతురాజు శ్రీధర్, వాలిపల్లి వెంకటరమణ, ముగుడ భద్రయ్య, కుంచాల బాలకృష్ణ, పంగ కృష్ణారావు పాల్గొన్నారు.

అరసవల్లికి యాత్రికుల తాకిడి

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి మాఘమాసం ఆదివారం కావడంతో రద్దీ పెరిగింది. దీనివల్ల ఆలయానికి ఆదాయం పెద్దఎత్తున సమకూరింది. ఆలయంలో టిక్కెట్లు విక్రయాల ద్వారా రూ.5,06,400లు, విరాళాల రూపంలో రూ.1,65,202లు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3,50,000 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న రచయితలు

కేలండర్ ఆవిష్కరణ

శ్రీకాకుళం అర్బన్ : ఘనమైన చారిత్రక నేపథ్యం ఉన్న విశాలాంధ్ర అనేది ఎంతో మంది అభ్యుదయ రచయితలకు, పాత్రికేయులకు ఒక దిక్సూచి రచయితలు నల్లి ధర్మారావు, అట్టాడ అప్పలనాయుడు అన్నారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రింట్ ఈ ఏడాది ముద్రించిన నూతన కేలండర్‌ను నగర పాలక సంస్థ పరిధిలోని దాసరి నాగభూషణ్ క్రాంతి భావన్‌లో ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇస్కఫ్ అధ్యక్షులు సనపల నరసింహులు, సిపిఐ నాయకులు గురుగుబెల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

కనతివూరులో అన్నదానం

నందిగాం: మండలంలోని కనతివూరులో ఉన్న కొత్తమ్మతల్లి 20వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు మహిళలు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. పరిసర గ్రామాలకు చెందిన యాత్రికులు ఐదు వేల మంది వరకూ పాల్గొన్నారు. కళింగ కార్పొరేషన్ చైర్మన్ పి.తిలక్, ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ముగిసిన జాతర మహోత్సవం

పోలాకి: పోలాకి కేంద్రంలో ఐదు రోజులుగా నిర్వహించిన కనకదుర్గా భవాని అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారంతో ముగిసింది. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు టంకాల శ్రీరాములు, భవాని, పల్లి రాజు భవాని, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న వైసిపి నాయకులు

ఎస్‌ఐకి సన్మానం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.కె.మహ్మద్ అలీను తన కార్యాలయంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు దుక్క రోజారామకృష్ణ, మండల కో-ఆప్షన్ మెంబర్ షేక్ రంజాన్ రాజుబాయ్‌లు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో కురుడు ఎంపిటిసి చుక్క లోకనాథం పాల్గొన్నారు.

విశాఖలో పింఛను అందజేత

పలాస: మండలంలోని రాజగోపాలపురానికి చెందిన చాపర హేమలయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో విశాఖలోని దుర్గా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వాలంటీరు హిమబిందు తన సొంత ఖర్చులతో విశాఖ వెళ్లి హేమలయ్య వేలిముద్ర తీసుకుని ఆదివారం పింఛను అందజేసింది. దీంతో ఎంపిటిసి బి.డి.రావు, గ్రామస్తులు వాలంటీర్‌కు అభినందనలు తెలిపారు.



పింఛను అందజేస్తున్న వాలంటీర్ హిమబిందు

వైసిపి బలోపేతానికి కృషి

ఆమదాలవలస : మండలంలో క్షేత్రస్థాయి నుంచి వైసిపి బలోపేతానికి కృషి చేస్తానని సచివాలయాల మండల కన్వీనర్ బొడ్డేపల్లి నిరంజన్ అన్నారు. తన స్వగృహంలో ఆదివారం విలేకరుల తో మాట్లాడారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి పాలనలో సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థల ద్వారా సంక్షేమ పథకాలు ప్రజల చెంతకు చేరుతున్నాయని పేర్కొన్నారు. పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలను అందిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కిందన్నారు.



నిరంజన్



చెట్టుకు ఉన్న పిచ్చుక గూళ్లు

అందాల గూళ్లు

మండలంలోని బంజీరు వద్ద ఆదివారం కనిపించిన దృశ్యం ఇది. ఓ చెట్టుకు పిచ్చకులు గూళ్లు ఇలా కట్టుకోవడంతో చూపరులకు ఎంతో కనువిందు కలిగిస్తుంది.

- ప్రజాశక్తి, మెళియాపుట్టి